Sunday SPECIAL

టీచర్లూ.. సెల్యూట్





- తాము పనిచేసే సర్కారు బడిలోనే తమ పిల్లలకు చదువులు
- ప్రైవేటు స్కూళ్లు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దంటున్న పలువురు గురువులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- గవర్నమెంట్ బడుల్లోనే మెరుగైన బోధన, సౌకర్యాలున్నాయంటూ కితాబు

7

ఇప్పుడంతా 'కార్పొరేట్' యుగం. చదువుల నుంచి కొలువుల వరకూ అందరూ కార్పొరేట్ సంస్థలవైపే మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై తల్లిదండ్రులు కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సైతం కష్టాలు పడైనా.. అప్పులు చేసైనా.. తమ పిల్లలను ప్రముఖ నగరాలు, పట్టణాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తుంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం.. తమ పిల్లలకు తాము పనిచేసే ప్రభుత్వ బడుల్లోనే చదువు చెప్పిస్తున్నారు. పెద్దపెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు చెప్పించే స్థోమత ఉన్నా.. సర్కారు స్కూళ్లలోనూ మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధన అందుతోందని, ప్రైవేట్, కార్పొరేట్ తరహాలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, ఇంగ్లీష్ మీడియం బోధన కూడా మెరుగ్గానే ఉంటోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కొలువులు చేసి.. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకోవడమే కాదు.. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించేలా తమ పిల్లలకు సర్కారు చదువు చెప్పిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మద్యనిషేధం దిశగా ఫతేషాపూర్

అమలు చేయాలంటూ గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం



గ్రామసభలో తీర్మానం చేస్తున్న గ్రామస్థులు

రఘునాథపల్లి, జూలై 27: విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టుషాపులతో యువత మద్యానికి బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని భావించిన ఫతేషాపూర్ గ్రామస్థులు ఒక నిర్ణయానికి వచ్చారు. శనివారం జరిగిన గ్రామసభలో మద్యని షేధం అమలు చేసేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. స్పెషల్ ఆఫీసర్ కాకి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మహిళలు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో మద్యనిషేధం అమలు చేయాలని, ఎవరైనా అమ్మితే రూ.5 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. ఆగస్టు 1 నుంచి గ్రామంలో మద్యం విక్రయించవద్దని బెల్టుషాపు నిర్వాహకులకు సూచించారు. దీంతో మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఐదేళ్ల తర్వాత డబ్బులు రికవరీ

ఆధార్‌కార్డులో మార్పులు చేస్తానని కాజేసిన నిందితుడు

కేసు కోర్టు విచారణలో ఉండగానే తిరిగి చెల్లింపు



భాదితులకు రికవరీ అయిన డబ్బులు అందజేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 27: ఆధార్ కార్డులో సవరణలు చేస్తానని చెప్పి ఓ వ్యక్తి ఐదేళ్ల క్రితం గ్రామస్థుల వద్ద డబ్బులు కాజేశాడు. విషయం గమనించిన బాధితులు కోర్టుకు వెళ్లారు. కేసు విచారణలో ఉండగానే నిందితుడు కాజేసిన డబ్బులను తిరిగి చెల్లించాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూలై మొదటి వారంలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ అనే వ్యక్తి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండ గ్రామానికి వచ్చాడు. అప్పటికి నూతన జిల్లాలు ఏర్పడినందున సర్పంచ్‌కు మాయమాటలు చెప్పి ఆధార్‌లో జిల్లా పేరును మార్చుతానంటూ జీపీలోనే అడ్డా ఏర్పాటు చేసుకున్నాడు. వారం రోజుల పాటు గ్రామంలోనే మకాం వేసి గ్రామస్థుల ఆధార్‌కార్డులను ల్యాప్‌టాప్‌లో నమోదు చేసుకున్నాడు. 295మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.600 నుంచి రూ.1000 వరకు కాజేశాడు. వారం రోజుల తరువాత బాధితులు బ్యాంకులకు వెళితే వారి ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో మోసం జరిగిందని గ్రహించారు. అప్పటికే నిందుతుడు గ్రామం నుంచి పరారయ్యాడు. ఈ విషయమై సర్పంచ్, ఎంపీటీసీలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రాజిరెడ్డి కేసు నమోదు చేశారు. న్యాయం కోసం పలుమార్లు కోర్టుకు వెళ్లారు. కేసు విచారణలో ఉండగానే ఎలాగైనా డబ్బులు చెల్లించక తప్పదని భావించిన నిందితుడు తాను కాజేసిన రూ.1,80,000 లను శనివారం కోర్టు ద్వారా మాజీ ఎంపీటీసీ పులి యాకయ్యకు అందించాడు. ఆయన డబ్బులు పోగొట్టుకున్న వారి జాబితాను గోడలపై అంటించి అందరినీ జీపీకి పిలిపించారు. లిస్టు ప్రకారం అందరికీ డబ్బులు అందించారు. ఐదేళ్లకైనా డబ్బులు వచ్చాయని బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

బీమా రైతన్నకు ధీమా



- బాధిత కుటుంబాలకు బాసటగా 'రైతు బీమా'
- నూతన పట్టాదారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- జూన్ 28లోపు పాస్‌బుక్ పొందిన వారు అర్హులు
- ఆగస్టు 5వ తేదీ తుది గడువు
- ఈనెల 30 వరకు రెన్యూవల్స్, తప్పుల సవరణకు అవకాశం
- జిల్లాలో 8,665 మంది నూతన పట్టాదారులు

జఫర్‌గడ్, జూలై 27 : పెద్ద దిక్కును కోల్పోయిన అన్నదాతల కుటుంబాలకు రైతు బీమా పథకం ఆసరాగా నిలుస్తోంది. కర్షకులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన వారు, గతంలో బీమా పథకంలో ఉండి నామినీ చనిపోయిన వారు, ఆధార్‌కార్డులో తప్పులు ఉన్నవారు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. గ్రామాల వారీగా గడువులోగా కొత్త పట్టాలు పొందిన వారి జాబితాను ప్రకటించింది. వారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు, విస్తరణాధికారులు (ఏఈఓ)లకు ఇచ్చారు. వారి సమక్షంలో రైతు దరఖాస్తుపై సంతకం చేయాల్సి ఉంటుంది. బీమా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది.

2018 నుంచి బీమా పథకం అమలు

కుటుంబ యజమాని అయిన రైతు ఏదేని కారణం చేత మరణించినపుడు బాధిత రైతు భార్యా, పిల్లలను ఆర్థికంగా ఆదుకునేందుకు గత ప్రభుత్వం 2018, ఆగస్టు 18 నుంచి రైతు బీమా పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. అకాల మరణం చెందిన రైతు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు నామినీ పత్రాలను అందిస్తే రూ.5 లక్షల పరిహారాన్ని ఎల్‌ఐసీ సంస్థ అందిస్తుంది. రైతుల వార్షిక ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించే విధంగా ఎల్‌ఐసీ సంస్థతో ఒప్పందం కొనసాగుతోంది. ఒక్కో రైతు పేరు మీద సంస్థకు ప్రభుత్వమే రూ.3,600ల చొప్పున ప్రీమియం చెల్లిస్తుంది. 2023 ఆగస్టు 19 వరకు గత సర్కార్ ప్రీమియం చెల్లించినప్పటికీ.. ఈ ఏడాది 2024 ఆగస్టులో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా ప్రభుత్వం 2024 జూన్ 28 వరకు పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండి 18 నుంచి 59 ఏళ్ల వయసున్న రైతులు ఈ బీమా పథకానికి అర్హులని ప్రకటించింది.

రైతు కుటుంబాలకు ఆర్థికంగా అండగా..

జిల్లాలో జనాభాలో అత్యధిక శాతం రైతులు ఉన్నారు. అనుకోని పరిస్థితుల్లో రైతు చనిపోతే అతని కుటుంబ సభ్యులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువంటి సందర్భాల్లో బీమా పథకం ఆర్థికంగా చేయూతనందిస్తోంది.



జఫర్‌గడ్ మండలంలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈవోలు

ప్రస్తుతం జిల్లాలో పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన రైతులు 1,92,786 మంది ఉన్నారు. కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు 8,665 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆగస్టు 5 వరకు దరఖాస్తులకు అవకాశం

రైతు బీమా పథకానికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది జూన్ 28లోపు పట్టాదారు పాసుపుస్తకం లేదా తహసిల్దార్‌తో డిజిటల్ డీఎస్ పేపర్ ఉన్నవారే బీమా దరఖాస్తుకు అర్హులు. రైతు వయసు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. అర్హులైన వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను స్థానికంగా ఉండే ఏఈవోలకు నేరుగా అందించాలి. వారు వ్యవసాయ శాఖ సైట్‌లో వివరాలను నమోదు చేస్తారు. కాగా, బీమాను రెన్యూవల్ చేసుకోవాలన్నా.. సవరణలు చేసుకోవాలన్నా ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. బీమా చేసుకున్న రైతు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబానికి పరిహారం కింద రూ.5 లక్షలు అందుతుంది. నామినీ ఖాతాలో బీమా పరిహారాన్ని ఎల్‌ఐసీ సంస్థ జమ చేస్తుంది.

2023 వరకు జిల్లాలో బీమా లబ్ధిదారులు, మంజూరైన పరిహారం వివరాలు

సంవత్సరం	మృతి చెందిన రైతులు	అందిన పరిహారం (రూ.కోట్లలో)
2018	378	18.90
2019	456	22.80
2020	690	34.50
2021	554	27.70
2022	579	28.95
2023	469	23.45
మొత్తం	3,128	156.30

రైతులు దరఖాస్తు చేసుకోవాలి..

పి.వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి



ప్రభుత్వం కల్పించిన బీమా సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు 8,665 మంది రైతులు ఉన్నారు. ఇందులో నిబంధనల ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న రైతులకు మాత్రమే బీమా పథకం వర్తిస్తుంది. వ్యవసాయాధికారులు, ఏఈవోల వద్దకు రైతులు నేరుగా వెళ్లి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను సమర్పించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలి.. ఈ పథకం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

నేడు ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి

జనగామ రూరల్, జూలై 26: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసి రెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఏసిరెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ గ్రౌండ్ నుంచి కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, రాష్ట్ర నాయకులు హాజరవుతారని.. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

జనగామ డిపో మేనేజర్ స్వాతి

జనగామ రూరల్, జూలై 27: శ్రావణమాసం సందర్భంగా శుభకార్యాల కోసం బస్సులను అద్దెకు ఇస్తామని జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, ఇతర శుభకార్యాలకు అతి తక్కువ ఖర్చుతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9959226050, 7981951562, 7382852818 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో బోనాల జాతర

శివసత్తులు, పోతరాజుల వేషధారణలో అకట్టుకున్న విద్యార్థులు



పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మహంకాళి దేవికి బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, జూలై 27 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల జాతరను శనివారం జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాల/కళాశాలలో వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు, మహంకాళీ దేవికి బోనాలు, నైవేద్యం సమర్పణ, భవిష్యవాణి, ఉపాధ్యాయ బృందం సంప్రదాయ వస్త్రధారణ, పోతరాజుల విన్యాసాలు వంటి అంశాలు అందరినీ ఆకర్షిస్తూ.. తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని చాటిచెప్పాయి. 'మన సంస్కృతి-మన పండుగ' అనే నినాదంతో తెలంగాణ పండుగల నేపథ్యం, ప్రజల జీవన విధానం, సంప్రదాయ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో బోనాల పండుగను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం, సాంస్కృతిక విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బాల బాలికలు, ఉపాధ్యాయ బృందం సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోతరాజుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. బోనాలను నెత్తిన పెట్టుకుని, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డీజే సౌండ్ గీతాల సవ్వడి నడుమ.. పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మహంకాళీ దేవీ చిత్రపటం వద్ద నైవేద్యాన్ని సమర్పించారు. ప్రజలను సల్లంగా చూడు తల్లీ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో సుఖ సంతోషాలతో జీవించేలా దీవించు అమ్మా.. అంటూ వేడుకున్నారు. అనంతరం ఓ విద్యార్థిని భవిష్యవాణి వినిపించడం ఆకర్షించింది. విద్యాభివృద్ధి, చదువు ప్రాధాన్యత, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుపై వినిపించిన మాటలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ పండుగలు ప్రజల జీవన సంస్కృతిని, సంప్రదాయాలను చాటి చెబుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు గొప్ప అనుభూతిని కలిగిస్తాయన్నారు. సృజనాత్మకతను పెంపొందించుకుంటూ విజ్ఞానాభివృద్ధి సాధించాలని విద్యార్థులకు ఉద్బోధించారు.



పోతరాజుల వేషధారణలో విద్యార్థులు

ఆర్థిక ఇబ్బందులతో జీపీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటేష్(ఫైల్)

తొర్రూరు, జూలై 27 : ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం. మహబూ బాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల వెంకటేష్ (32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యదర్శుల వేతనాలు పెంచాలని కోరు తూ గతంలో సమ్మె చేసిన నేపథ్యంలో వేతనాలు రాకపోవడం, ఒకసారి విధుల నుంచి సస్పెండ్ కావడంతో మనోవేదనకు గురయ్యా డు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండడంతో సతమతమవుతున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పట్టణ శివారులోని వ్యవసాయ బావిలో దూకి వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో శవా న్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య పేర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడారం పూజారి మృతికి మంత్రుల సంతాపం

మేడారం, జులై 27 : తాడ్వాయి మండలం మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ మృతికి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సంతాపం తెలిపారు. పూజారి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

టీచర్లూ.. సెల్యూట్

తాము పనిచేసే సర్కారు బడిలోనే పిల్లలకూ చదువులు ● ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న గురువులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పడమే కాదు... తమ పిల్లలను కూడా సర్కారు బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తున్నారు కొందరు టీచర్లు. ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి వారు సైతం అప్పో సప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ బడులు, కళాశాలలకు పంపిస్తున్నారు. మరి ప్రభుత్వ ఉద్యోగులైతే.. మరింత పేరున్న సంస్థల్లో చదివిస్తున్నారు. అందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. తమ పిల్లల చదువుల కోసమే అనేకమంది తమ సొంత ఊళ్లను వదిలి నగరాల్లో స్థిరపడిపోతున్నారు. అయితే సర్కారు విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకునే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీఏటా బడిబాట కార్యక్రమాలతో గ్రామాల్లోకి వెళుతున్నారు. ఆ సమయంలో 'మీ పిల్లలనేమో ప్రైవేటుబడికి పంపుతారా? మా పిల్లలేమో సర్కారు బడికి పంపాలా?' అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి ఎదురవుతున్నాయి. కానీ ఇలాంటి పరిస్థితుల్లో తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం.

సకల సౌకర్యాల సర్కారు బడి...

ప్రభుత్వ బడిలో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. బోధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయులనే ప్రభుత్వం నియమిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వం మన ఊరు.. మన బడి, మన బస్తీ- మన పాఠశాల, పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అనేక పాఠశాలల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొన్నిచోట్ల ప్రభుత్వ బడుల్లో కూడా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. ఉచితంగా స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడికి మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో డీఎడ్, బీఎడ్, ఎంఎడ్ తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులను పూర్తి చేసిన వారినే టీచర్లుగా నియమిస్తోంది. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పాఠాల బోధన జరుగుతోంది. దీంతో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా పునరాలోచనలో పడ్డారు. తాము విద్యార్థులను బడిలో చేర్పించాలని ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు.. 'మీ పిల్లలను ప్రభుత్వ బడిలో ఎందుకు చేర్చరు..' అని తల్లిదండ్రుల నుంచి ఎదురైన ప్రశ్నలకు కొందరు సమాధానం ఇస్తున్నారు. తాము చెప్పే విద్యనే తమ పిల్లలకు కూడా అందించాలనే తాపత్రాయంతో ఉమ్మడి జిల్లాలోని చాలామంది టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థికస్థోమత ఉన్నా ప్రభుత్వం పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కితాబివ్వడమేకాదు.. ప్రజల్లోనూ నమ్మకం కలిగించేలా తమ పిల్లలను సర్కారు బడిలో చదివిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ బడిలో ఉండే ఇంగ్లీషు మీడియం సర్కారు బడిలో కూడా ఉండటంతో ఇతర పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ సర్కారు బడిలో చదువుకునేలా కృషి చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

ఒత్తిడి లేని చదువు ప్రభుత్వ బడిలోనే..

'మేం 1వ తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యనే అభ్యసించాం. ఏ ఒత్తిడి లేకుండా చదువుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడినాం. మా పిల్లలకు ఒత్తిడి లేని చదువు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాం.. మా ఇద్దరు పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తున్నాం' అని ఉపాధ్యాయ దంపతులు శ్యామలత, రాజు చెబుతున్నారు. శ్యామలత మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రాపల్లి జడ్పీఎస్ పాఠశాలలో, రాజు గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం టీచర్లుగా పని చేస్తున్నారు. వారి ఇద్దరు పిల్లలు హిమాన్షుసహన్, కొవిద్‌సహన్ వరంగల్‌లోని చార్‌బౌలి ప్రభుత్వ పాఠశాలలో ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో హోం వర్క్ పేరుతో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని ఆ ఉపాధ్యాయ దంపతులు అంటున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే అయినా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇద్దరు పిల్లలు సర్కారు బడికే..

ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో టీజీటీగా పని చేస్తున్న సుధారాణి తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. తన కుమారుడు సుమితేష్ 8వ తరగతి, కుమార్తె సంవిద 6వ తరగతి టీజీఎంఎస్‌లో చదువుతున్నారు. అలాగే ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరాచారి తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఇదే గ్రామంలోని జడ్పీఎస్ పాఠశాలలో కుమారు చైతన్యరిషి 8వ తరగతి చదువుతుండగా, కుమార్తె ఆరాధ్య 6వ తరగతి చదువుతోంది. చైతన్యరిషి 2వ తరగతి నుంచి, ఆరాధ్య 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. తాను చదువు చెప్పే సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య ఉందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నామని ఆ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

తాను చదువు చెప్పే బడిలోనే..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జడ్పీఎస్ పాఠశాలలో స్టాలిన్ బేగ్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన స్టాలిన్‌బేగ్ తాను పాఠాలు చెప్పుతున్న బడిలోనే తన ఇద్దరు పిల్లలను కూడా చదివిస్తున్నారు. ఇటీవలే భీమదేవరపల్లి పాఠశాలలో కుమార్తె పదో తరగతి పూర్తి చేయగా.. కుమారుడు తల్వార్‌బేగ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్న స్టాలిన్‌బేగ్ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రైవేట్ బడిలో ఉండరని, ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉంటుందని స్టాలిన్‌బేగ్ పేర్కొంటున్నారు.

ఆ ఉపాధ్యాయుల పిల్లలంతా సర్కారుకే..

మరిపెడ మండలం సీతారాంపురంతండా, మరిపెడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. మరిపెడ జడ్పీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందిగామ జనార్దనాచారి తన కుమార్తె సరస్వతిని పదోతరగతి, మరో ఉపాధ్యాయుడు సారయ్య తన కుమార్తె దేవిని ఏడోతరగతి, ఉపాధ్యాయుడు లాల్‌చంద్ తన కుమార్తె మైథిలీని ఏడోతరగతి, కె.వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల పిల్లలు మరిపెడ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇస్మిత 8వ తరగతి, హర్షద్ 7వ తరగతి చదివిస్తున్నారు. వీరే కాకుండా దంతాలపల్లి జడ్పీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ పండిట్ డి.పరంకుశచారి 9వ తరగతి చదువుతున్న తన కుమార్తె సిరిచందనను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే కొత్తగూడ మండలానికి చెందిన పుల్సం కవిత తన కుమార్తె సాహిత్యను గూడూరుకు చెందిన ఉపాధ్యాయుడు తాటి బుచ్చురాములు తన ఇద్దరు పిల్లలు వేదశ్రీ 2వ తరగతి, గాయత్రి 1వ తరగతిలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



కారులో కూరగాయల విక్రయం

జూలైవాడ, జూలై 27: కూరగాయలను సైకిళ్లు, తోపుడు బండ్లపై వాడవాడల తిరుగుతూ విక్రయించేవారు. ఎలాంటి అద్దె ఖర్చు లేకుండా మొబైల్ వాహనాలపై వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా శాతం వాహనాలపై ఉదయం, సాయంత్రం వేళల్లో టిఫిన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించి కారునే కూరగాయల విక్రయ కేంద్రంగా మార్చుకున్నాడు. శనివారం హనుమకొండ గ్రేటర్ 59వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఖరీదైన కారులో వివిధ రకాల కూరగాయలు విక్రయిస్తూ పలువురిని ఆకర్షించాడు. కారు వెనుక డిక్కీలో తూకం మిషన్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు విక్రయిస్తున్నాడు.



కారులో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

పెండింగ్ స్లాట్‌లకు హాజరుకావాలి..

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల

వరంగల్ క్రైం, జూలై 27: హనుమకొండ రవాణా శాఖ కార్యాలయంలో జనవరి 2020 నుంచి ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేసుకున్న అప్లికేషన్లు 1,263 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి హాజరుకావాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల ఒక ప్రకటనలో కోరారు. వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్సుదారులు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించి కార్యాలయానికి వచ్చి డ్రైవింగ్ టెస్ట్, వాహన ఇన్స్‌పెక్షన్ వంటివి చేయించకపోవడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని వలన ఏదైనా న్యాయపరమైన సమస్యలు, ఇన్సూరెన్స్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు చింతగట్టు క్యాంపు వద్ద ఉన్న కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని శ్రీనివాస్ సూచించారు.

కమిషనరేట్‌లో ముగ్గురు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 27: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఒ.రమేశ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, పి.దామోదర్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, ఎం.రంజిత్‌కుమార్ కమిషనరేట్ నుంచి వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు కేటాయించారు.

ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ బదిలీపై వెలసిన ఫ్లెక్సీలు



వరంగల్ మెడికల్, జూలై 27: ఇటీవల ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ కావడంపై ఎంజీఎం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు ఎంజీఎంకు పట్టిన పీడ విరగడ అయిందంటూ ఎంజీఎం గేటుకు ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఘటన పెద్దాస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్పీడీసీఎల్ స్టోర్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 27:ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన విద్యుత్ సామగ్రిని సరఫరా చేసే స్టోర్‌ను హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీఅండ్‌డీ వర్క్స్ కొత్త సర్వీసుల రిలీజ్‌లు, ఇతరత్రా అవసరాలు తీర్చడానికి స్టోర్‌లో మెటీరియల్ లభ్యతపై ఆరా తీశారు.

విద్యార్థి సంఘ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం వినతి

హనుమకొండ కలెక్టరేట్, జూలై27: కొందరు విద్యార్థి సంఘాల పేర్లు చెప్పుకుంటూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆర్‌టీపీ, బీఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల అధ్యక్షులు తమ కళాశాలలకు వచ్చి చందాల వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. చందా ఇవ్వని కళాశాలల ముందు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే పేరుతో ధర్నాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నిరుద్యోగులైన తాము ప్రైవేట్ కళాశాలలు పెట్టుకుని ఉపాధి పొందుతూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, కొందరు కుల సంఘాల నాయకులు ఆర్‌టీఏ యాక్ట్ కింద నోటీసులు ఇస్తూ తమను ఒత్తిడి గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఈ విద్యార్థి సంఘాల నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రాజు, గౌరవ సలహాదారులు గౌరు తిరుపతిరెడ్డి, కుమార్, రాజిరెడ్డి, రాంమూర్తి, కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, తాళ్లపల్లి స్వామి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

బాలసముద్రం, జూలై 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను శనివారం హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ధరమ్‌సింగ్ మాట్లాడుతూ.. ఇందనాన్ని పొదుపుగా వాడి ఆదాయం తెచ్చి సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు తమ ప్రతిభను కనబరిచి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు



అవార్డులు పొందిన ఉద్యోగులు

అలంకారప్రాయంగా టీ డయాగ్నోస్టిక్ సెంటర్లు

- రేడియాలజీ పరీక్షలు లేవు..
- ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందే..
- డిప్యూటేషన్ సిబ్బందితో సరి

వరంగల్ మెడికల్, జూలై 27: పేద రోగుల సౌకర్యార్థం అట్టహాసంగా ప్రారంభించిన టీడయాగ్నోస్టిక్ కేంద్రం సిబ్బంది కొరతతో విలవిలలాడుతోంది. రేడియాజిస్టు వైద్యులు లేక సేవలు నిచిలిపోయాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కళ్ల ముందే నీరుగారిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎన్నో ఆశలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు రేడియాలజీ సేవలు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంపై కథనం.

రేడియాలజీ వైద్యుడు కరువు

ప్రతీ వైద్య చికిత్సలో రేడియాలజీ విభాగానికి అత్యంత ప్రాధాన్యముంటుంది. ఇందులో ప్రధానంగా ఈసీజీ, మెమోగ్రఫీ, అల్ట్రామిన్ స్కాన్, ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయి. కానీ రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో ఇవన్నీ మూలనపడ్డాయి. సిటీ, ఎంఆర్ఐ పరికరాలు ఇంతవరకు మంజూరు కూడా కాలేదు. రేడియాలజీ వైద్యుడి కోసం రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదని హబ్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రత్యేక చొరవ చూపితే డిప్యూటేషన్‌పై ఓరేడియాలజీని పంపించే అవకాశం ఉన్నప్పటికీ చొరవ చూపకపోవడంతో విభాగం సేవలు నిల్‌గా మారాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు విభాగాలు మాత్రమే..

టీహబ్‌లో రేడియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలు ఏర్పాటు చేశారు. వీటితో రేడియాలజీ విభాగానికి వైద్యుడు లేకపోవడంతో మొదటి నుంచి మూతపడింది. ఇక బయోకెమిస్ట్‌గా పని చేస్తున్న వైద్యులు ఇటీవల బదిలీల్లో వెళ్లిపోవడంతో ఆ విభాగం మూతపడే దశలో ఉంది. ప్రస్తుతం పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు మాత్రం ఏడుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

నిత్యం వేయి శాంపిళ్లు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్బన్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఈహెచ్ఎస్, ఇలా 33మార్గాల ద్వారా శాంపిళ్లు టీహబ్‌కు చేరుకుంటాయి. స్టెరిలైజేషన్ కోల్డ్ స్టోరేజ్ కలిగిన మూడు వాహనాలు కూడా ప్రతీరోజు మూడు రూట్లలో వెళుతు సాయంత్రం 4గంటల వరకు శాంపిళ్లను సేకరించి, ఆధార్, ఫోన్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నారు. పరీక్ష ఫలితాలను నేరుగా వారి మొబైల్‌లకు మెసేజ్ ద్వారా వెళుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న రేడియాలజీ సెంటర్

మల విసర్జన పరీక్షలు లేవు

57 రకాల పరీక్షలు తెలంగాణ హబ్‌లో నిర్వహిస్తున్నప్పటికీ మలవిసర్జన పరీక్షలు మాత్రం రియజెంట్స్ లేవనేసాకుతో కొద్దికాలంగా పరీక్షలు నిలిపివేశారు. ప్రోటీన్ టెస్ట్, హెచ్‌బీ పర్సంటేజ్ టెస్టులు కూడా జరగడం లేదు.

మూలనపడ్డ మిషన్లు

టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో కల్చర్ మిషన్, ఎలక్ట్రోఫోర్స్, కాంగ్లో మీటర్ మిషన్లు మూలనపడ్డాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోగుల తాకిడికి అనుకూలంగా టెక్నీషిన్లను నియమించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. మిషన్ కూడా బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు టీ హబ్ ఉద్యోగులు వాపోతున్నారు. టీ హబ్‌లో మౌలిక సదుపాయాల మెరుగు కోసం అధికారులు కృషి చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 27: డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అధికారులు, సిబ్బందికి సూచించారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోల్ట్స్, పెట్రోకార్, పోలీసు అధికారులతో సీపీ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. బ్లూకోల్ట్స్ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ఫిర్యాదులు వచ్చిన వెంటనే నిర్దేశించిన సమయాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డయల్ 100 ఫిర్యాదులపై స్పందించాలన్నారు. పెట్రోలింగ్ విధులే కాకుండా పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. అలాగే కేడీలను, రౌడీషీటర్లను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ప్రజలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావాలన్నారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

రఘునాథపల్లి మాజీ సర్పంచ్‌పై విచారణ


డిఎల్‌పీవో పార్థసారథికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ పోకల శివకుమార్

రఘునాథపల్లి, జూలై 27: రఘునాథపల్లి మాజీ సర్పంచ్ పోకల శివకుమార్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు జీపీ కార్యాలయంలో డీఎల్‌పీవో పార్థసారథి శనివారం విచారణ చేపట్టారు. శివకుమార్ గతంలో పంచాయతీ నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు పంచాయతీ అనుమతులు లేకుండనే ఇంటి నిర్మాణం చేపట్టాడని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజాదర్బార్‌లో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ విచారణ నిర్వహించి, తదుపరి విచారణ బాధ్యతను డీఎల్‌పీవో పార్థసారథికి అప్పగించారు. దీంతో శనివారం ఆయన జీపీ కార్యాలయంలో చేపట్టిన విచారణకు శివకుమార్ హాజరు కాగా, ఫిర్యాదు చేసిన ముగ్గురు హాజరు కాలేదు. కాగా, పోకల శివకుమార్ సర్పంచ్‌గా పనిచేసిన ఏడేళ్లకు సంబంధించిన రికార్డులను రెండు రోజులలో తనకు అప్పగించాలని పంచాయతీ కార్యదర్శి కవితను ఆదేశించారు. ఈ సందర్భంగా పోకల శివకుమార్ పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని డీఎల్‌పీవోకు అందజేశారు. గతంలోనే తనపై డీపీవో, కలెక్టర్ విచారణ జరిపారని, అభియోగాలు నిరాధారమని రుజువు కావడంతో ఎటువంటి చర్యలు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి సుచరిత

జనగామ రూరల్, జూలై 27: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సుచరిత మాట్లాడుతూ చదువుతో పాటు విజ్ఞానం పెంచుకోవాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరం కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. కనుకరాజు, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రవీంద్ర, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ జోత్స్న పాల్గొన్నారు.


జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్‌లో మొక్కలు నాటుతున్న డీఈవో కె.రాము తదితరులు


స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, తదితరులు



ఏనెబావి టెక్స్‌టైల్ పార్కులో మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్


బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో అయిల్‌పాం మొక్క నాటుతున్న జిల్లా అధికారిణి లత

ఘనంగా వన మహోత్సవం

● పాఠశాలలు, ఆస్పత్రుల్లో మొక్కలు నాటిన అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 27: వన మహోత్సవం కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో శనివారం ఉత్సాహంగా మొక్కలు నాటారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీహెచ్‌సీ, క్లస్టర్ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం నివారణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పుట్టిన రోజు వేడుకల్లో, ఇతర సందర్భాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్యారాణి, జనార్దన్, ప్రదీప్‌కుమార్, అజయ్‌కుమార్, సీహెచ్‌ఓ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. శివునిపల్లి హైస్కూల్, పీఎస్, యూపీఎస్, ఘన్‌పూర్ హైస్కూల్, పీఎస్‌లలో విద్యార్థులు శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తమ తల్లి పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు కె.రమేశ్, వి.కొంరెల్లి, శ్రీధర్, ఎం.సంపత్, సదామోహన్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లతో మానవాళికి మనుగడ: అడిషనల్ కలెక్టర్

లింగాలఘణపురం: చెట్లతోనే మానవాళికి మనుగగ అని అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన లింగాలఘణపురం మండలం ఏనెబావి గ్రామపంచాయతీ పరిధి టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రధానమన్నారు. మొక్కలను నాటడం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయని, భూగర్భ జలాలు సమృద్ధిగా పెంపొంది సాగునీటి సమస్య రాదని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మొగులప్ప, మండల ప్రత్యేకాధికారి కేఆర్ లత, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఎంపీవో మల్లికార్జున్, కారోబార్ మహెందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి: డీఈవో కె.రాము

జనగామ రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీఈవో కె.రాము పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఓబుల్‌కేశ్వాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని, జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విరంజని, ఏఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయిల్‌పాంతో లాభాలు: ఉద్యాన అధికారి కేఆర్ లత

బచ్చన్నపేట: అయిల్‌పాం తోటల పెంపకంతో మంచి లాభాలు అర్జించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి కేఆర్ లత అన్నారు. శనివారం ఆమె పోచన్నపేట గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా చింతల విజయలక్ష్మీ, అపర్ణ, రమ్య మహిళా రైతుల వ్యవసాయ క్షేత్రంలోని 14 ఎకరాల్లో అయిల్‌పాం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు అయిల్‌పాం సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఎవరైనా సాగు చేయాలనుకుంటే తమ శాఖ ప్రతినిధిని సంప్రదిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అయిల్‌పాం ఇంచార్జ్ హదస్స, హార్టికల్చర్ ఆఫీసర్ రవికాంత్, ఏవో హారిక, ఏఈవో శశి, రైతులు జనార్దన్‌రెడ్డి, బాలచందర్, మామిడి అయిలయ్య, మల్లేశ్, నారాయణ, బాలయ్య, శివరాములు, కిష్టయ్య పాల్గొన్నారు.

వర్షాలకు ధ్వంసమైన రోడ్డు

ఎమ్మెల్యే ఆదేశంతో మరమ్మతుకు అధికారుల చర్యలు


రఘునాథ్‌పల్లి - కూనూరు మధ్య దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

జఫర్‌గఢ్, జూలై 27 : వరుసగా కురుస్తున్న ముసుర్లకు మండలంలోని రఘునాథ్‌పల్లి - కూనూరు గ్రామాల మధ్య బీటీ రోడ్డు ధ్వంసమైంది. మండల వాసులు కూనూరు నుంచి రఘునాథ్‌పల్లి మీదుగా వెంకటాపూర్, మడికొండ మీదుగా కాజీపేటకు ఈ రోడ్డు నుంచే ప్రయాణిస్తుంటారు. అయితే రఘునాథ్‌పల్లి శివారులో పాత కల్వర్టు శుక్రవారం సాయంత్రం కుంగింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం రద్దు కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి.. రోడ్డును పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులు చేయించాలని ఇంజనీరింగ్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు బొమ్మినేని పెద్దిరెడ్డి, రాజశేఖర్, శిరబోయిన శ్రీనివాస్, కార్యదర్శి రవి, తదితరులు రోడ్డును పరిశీలించారు. తాత్కాలికంగా రహదారి మరమ్మతుకు అధికారులు చర్యలు చేపట్టారు.

'సమస్యల పరిష్కారం సీపీఐకే సాధ్యం'

చిలుపూర్, జూలై 27: ప్రజా సమస్యల పరిష్కారం సీపీఐ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అన్నారు. శనివారం లింగంపల్లిలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద, బడుగు బలహీనవర్గాల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. రానున్న రోజుల్లో సీపీఐ పార్టీని గ్రామగ్రామాన విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందుకోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంగళంపల్లి జనార్ధన్, పాతూరి సుగుణమ్మ, మండల కమిటీ నూతన కార్యదర్శి బోనగిరి కుమారస్వామి, గుంటిపెల్లి వాజ్‌పేయి, పంగ చంద్రమౌళి, సారంపెల్లి రాధ, కుంచం కార్యవర్ది రాజు, చొక్కం సునంద తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు త్వరలోనే పాల బిల్లులు

విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ


డీడీ సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 27: విజయ డెయిరీకి పాలు పోసిన రైతుల బిల్లులు త్వరలోనే అందిస్తామని ఎవరూ అధైర్య పడవద్దని జనగామ జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పాలశీతలన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇటీవల నూతనంగా విధుల్లో చేరి మొదటిసారిగా ఘన్‌పూర్‌కు వచ్చిన సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన సొసైటీల అధ్యక్షులు డీడీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీకి పాలుపోసే రైతులకు, మహిళ సంఘాలకు ప్రభుత్వం ద్వారా రెండు పాడి గేదెలను పంపిణీ చేయడానికి కలెక్టర్ కృషి చేస్తున్నారని, ఆసక్తిగల రైతులు గేదెలను తీసుకోవాలని కోరారు. పాల బిల్లుల విషయమై ఆందోళన చెందవద్దు అని, పాడిరైతుకు రావాల్సిన సబ్సిడీలు కూడా వస్తాయని తెలిపారు. గేదె పాలతో ఎక్కువ లాభాలు పొందవచ్చు అని, ప్రతీ రైతు గేదెలను పెంచడం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా మేనేజర్ హరికృష్ణ, మేనేజర్ శివప్రసాద్, ఘన్‌పూర్ మేనేజర్ లింగారెడ్డితో పాటు సాదం రమేష్, లక్ష్మినారాయణ, కుమారస్వామి, ఉదయ్, రామన్న పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

జనగామ రూరల్, జూలై 27: గుండెపోటుతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతీ ఒక్కరు సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని జడ్పీ సీఈవో అనిల్ కుమార్ అన్నారు. డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందికి సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ గుండెపోటు తో పడిపోయిన వారికి సీపీఆర్ ప్రథమ చికిత్సలా పని చేస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి



ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆహ్వానిస్తున్న పరశురామ్

జనగామ కల్చరల్, జూలై 27: కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ ఈ నెల 29, 30, 31 తేదీలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించు మహాధర్నాను జయప్రదం చేయాలని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జే.పరశురామ్ కోరారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ లోని నిరిమా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్‌ను పరశురామ్ శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని హామీ ఇవ్వడంతో పాటు ధర్నాలో పాల్గొంటున్నట్లు తెలిపారన్నారు.

దాడికేసులో ఇద్దరి అరెస్ట్

దేవరుప్పుల, జూలై 27: దాడి కేసులో దేవరుప్పుల పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న సీత్యతండకు చెందిన గుగులోతు మాన్‌సింగ్‌తో పాటు అతని తల్లి తారమ్మపై అదే తండాకు చెందిన గుగులోతు ఉపేందర్, దేవేందర్ కర్రలతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం నిందితులను కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేటు 14రోజుల రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతుడి పర్సులో దొరికన ఫొటో

జనగామ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టాలపై పూర్తిగా ఛిద్రమై ఉన్న మృతదేహాన్ని స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కాజీపేట వైపు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి ఫోన్ పూర్తిగా ధ్వంసం కావడంతో ఆధారాలను సేకరించడం రైల్వే పోలీసులకు కష్టంగా మారింది. మృతుడి పర్సులో దొరికిన ఫొటో, మృతదేహం ఆధారంగా పోలికలను పోలీసులు గుర్తించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని చనిపోయాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అన్న వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్ఐ శ్వేతపై చర్యలు తీసుకోవాలి

దేవరుప్పుల, జూలై 27: విద్యార్థి సంఘాల నేతలపై అక్రమకేసులు పెట్టిన జనగామ ఎస్సై శ్వేతపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని శ్వేత డిమాండ్ చేశారు. శనివారం దేవరుప్పులలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌పై విద్యారంగానికి నిధులు తక్కువగా కేటాయించారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి రోడ్డుపై ధర్నా చేసిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడిగె సందీప్, ధర్మభిక్షంలపై కక్ష పూరితంగా కేసులు పెట్టారని ఆరోపించారు. వారిపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

బురద రోడ్డుపై నాటు వేసి నిరసన


మట్టి రోడ్డుపై నాటువేసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

తరిగొప్పుల, జూలై 27: మండల కేంద్రం నుంచి అంకుషాపూర్ గ్రామానికి వెళ్లే తారు రోడ్డు తేలికపాటి వర్షానికే బురదమయం కావడంతో బీజేపీ నాయకులు రోడ్డుపై వరి నాటు వేసి విన్నూతన రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకుషాపూర్ వెళ్లే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గ్రామస్థులు సొంత నిధులతో మట్టిపోసి మరమ్మతులు చేపట్టారని అన్నారు. అయినప్పటికీ ఇటీవల కురిసిన తేలికపాటి వర్షానికే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, కొందరు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పబ్బోజు రాంబ్రహ్మచారి, జంగ వీరకుమార్, పెద్దబోయిన రాజు యాదవ్, కోన్నె రాజు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


పాలకుర్తిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి, జూలై 27: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, యువకులకు వ్యతిరేకంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు ఎలాంటి పొంతన లేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేయకుండానే ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక శాతం మంది ఉన్న బీసీ కులాలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, కడుదల నిరంజన్, వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్, మహేష్, అమరేందర్, కనకరాజు, పవన్, లాకావత్ రవి పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులను వినియోగించుకోవాలి

రఘునాథపల్లి, జూలై 27: ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని శ్రీమన్నారయణపురం గ్రామంలో శనివారం ఆయన రైతు రణమాఫీకి సంబంధించిన వివరాలను రైతులనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంటల సాగు వివరాలపై అవగాహన పెంపొందించుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని అన్నారు. ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా అధార్‌కార్డు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నీలం సుస్మిత, రైతులు మాచర్ల శ్రీనివాస్, రాంనర్సయ్య, బిక్షపతి, కొమురజీ, యాదగిరి, సిద్ధిరెడ్డి, మహేందర్, వీరాస్వామి, భాస్కర్, సత్తయ్య, శ్రీను, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత

బచ్చన్నపేట, జూలై 27: ప్రధాన రహదారి పక్కనున్న చెట్లను కొందరు నరికి వేసి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. శనివారం పోచన్నపేట శివారు కాశీనగర్ వద్ద రోడ్డు పక్కనున్న వేపచెట్టును కొట్టేశారు. అనుమతులు లేకుండా నరకటం నేరమని తెలిసినా కొందరు పట్టించుకోవడం లేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాలకుర్తి, జూలై 27: ఈ నెల 10న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన జయలక్ష్మి వ్యవసాయ కూలి పనులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళుతున్న క్రమంలో ఆటో వెనుకాల నుంచి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో జయలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

బడ్జెట్‌లో జనగామపై సవతి ప్రేమ

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప

బచ్చన్నపేట, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జనగామ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎంతో ఆశతో ఎదురు చూశారని అన్నారు. పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులున్న జనగామ ప్రాంతాన్ని విస్మరించటం ఇక్కడి నాయకుల చేతకానితనమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, సద్ది సోమిరెడ్డి, సెండెం నగేష్, రాము, జూకంటి గణేశ్, సురేశ్, రాంబాబు, నరేష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల కమిషన్

జిల్లా చైర్మన్‌గా గౌతమ్ గౌడ్

చిలుపూర్, జూలై 27 : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్) జిల్లా చైర్మన్‌గా చిలుపూర్ గుట్టకు చెందిన గనగోని గౌతమ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జాతీయ, రాష్ట్ర కమిషన్ చైర్మన్లు డాక్టర్ ఎన్‌వి నాగేశ్వర్ రావు, నలమాస శ్రీకాంత్‌లు నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

ఇన్నోవేషన్‌పై అవగాహన

దేవరుప్పుల, జూలై 27: ఇంటింటా ఇన్నోవేషన్‌పై శనివారం మండలపరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుతో సంబంధం లేకుండా మేధస్సును ఉపయోగించి కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్న వారిని గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. వారిలో ఉన్న సృజనాత్మక భావాలను వెలికితీయాలన్నారు. ఆగస్టు 3వరకు ఇన్నోవేటర్ యాప్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతిభను గుర్తించిన ఇన్నోవేటర్లకు ఆగస్టు 15న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'వినియోగదారుల సేవే లక్ష్యం'

జనగామ రూరల్, జూలై 27: విద్యుత్ వినియోగదారుల సేవే లక్ష్యంగా పనిచేస్తామని జనగామ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) వేణుమాధవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఫిర్యాదుల స్థాయిని బట్టి డీఈ, ఎస్ఈ కార్యాలయాల్లో పర్యవేక్షిస్తూ వినియోగదారులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తామన్నారు. వినియోగదారుల సేవే లక్ష్యంగా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

ఫర్టిలైజర్స్ యజమాని ఆత్మహత్య


సోమశేఖర్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 26 : మండల కేంద్రానికి చెందిన ఫర్టిలైజర్ యజమాని సలేంద్ర సోమశేఖర్ (32) ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తిలో ఎరువుల దుకాణం నడుపుతున్న సోమశేఖర్ కొంత మందికి ఎరువులను ఉద్దెరకు ఇవ్వగా అవి వసూలు కాలేదు. మరోవైపు పెట్టుబడి కోసం అప్పు ఇచ్చిన వారు అడుగుతుండంతో ఇంట్లో భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సోమశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు. కాగా, సోమశేఖర్ మృతిపట్ల ఫర్టిలైజర్ వ్యాపారులు రాజీవ్ చౌరస్తాలో సంతాపం ప్రకటించారు. వారిలో సంఘం నాయకులు అడూకడరి భూపాల్‌రావు, బత్తుల యాకన్న, తమ్మి మధు, రాపాక సంతోష్‌కుమార్, జీడి శోభన్‌బాబు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 27: ముదిరాజ్‌లన బీసీ-డి నుంచి బీసీ-ఏకు మార్చాలని కోరుతూ ముదిరాజ్ నాయకులు శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ముదిరాజ్‌లు బీసీ-ఏలో కొనసాగుతుంటే తెలంగాణలో మాత్రం బీసీ-డిలో కొనసాగుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లకు తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగనబోయిన శ్రీనివాస్, బూర్ల శంకర్, మునిగెల వెంకటేశ్వర్లు, పొన్నం నాగరాజు, పెసరు సారయ్య, మునిగెల రాజు, గోనెల రాజయ్య, యాదగిరి, గోనెల అనిల్, రవి, రాజు, ఐలోని, రాజయ్య, గణేష్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

'విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 27: విద్యార్థులు కేవలం పుస్తకాల ద్వారా కాకుండా ప్రయోగాత్మకంగా ప్రయోగాలు చేసి కారణాలు తెలుసుకుంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కె.రమేశ్ అన్నారు. పాఠశాలలోని ఆధునిక పరికరాలు ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో 8,9 తరగతుల విద్యార్థులకు శిక్షకుడు శ్యామ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాపు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు దేనినీ గుడ్డిగా నమ్మకుండా లోతుగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ శిక్షకులు టి.శ్రీనాథ్, జి.యాదగిరి, శర్మ, ఉపాధ్యాయులు కె.ప్రవీణ్, శ్రీనికాంత్, రాధాకృష్ణ, లక్ష్మీ ప్రసాద్, రవి, ఫకీర్‌దాసు, వసంతకుమారి, కృష్ణవేణి, ఉమారాణి, జానకీ జ్యోతి, సురేఖ, రజని, రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జనగామ రూరల్, జూలై 27: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లో బాల బాలికలకు వేరు వేరుగా అండర్-14, 16, 18, 20 జావలిన్ త్రో, 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం ఎంపికలు నిర్వహించామని మొత్తం 200 మంది బాల బాలకలు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో ఎంపికైన 20 మంది బాల బాలికలు ఆగస్టు 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆవుల అశోక్, కిష్టయ్య, హనుమంతరావు, రవీంద్ర ప్రసాద్, సైదులు, ప్రశాంత్, వంశీకృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.